
# నా దారి ఇటు!

వజ్రాయుధం మంత్లీ.. జూన్ 2002



"మధూ!"

"నో... అలా పిలవొద్దు... నే డాక్టర్ మాధవి!"

"పోనీ... మైడియర్ మాధవీలత?!"

"ఇక 'మైడియర్' అనే పదం అప్రస్తుతమేమో..?!"

"అప్రస్తుతం కాదు... ప్రస్తుతమే!"

"ప్రస్తుతం అప్రస్తుతాల గురించి ఆలోచించడానికి ఈ మనసు పాషాణంగా మారిపోయింది."

"అసలు నీకు నేను ఏం లోటు చేశాను చెప్పు!? ఇక ఎప్పుడూ చేయను కూడా! కానీ

నేను చేస్తున్న పని మా అమ్మానాన్నల కోసం! వాళ్ళ కోసం ఈ నిర్ణయం తీసుకోక తప్పడం లేదు!"

ఒక్కసారి జనార్ధన్ కళ్ళలోకి చూసింది. ఆ చూపులు ఎ.కె.47 రైఫిల్ నుండి వెలువడ్డ బుల్లెట్ కన్నా వేగంగా అతనికి తగిలేసరికి- ఆమె ముఖంలోకి చూడలేక తల వంచుకున్నాడు.

"చూడండి డాక్టర్ జనార్ధన్..!"

"నో... సే డియర్ జనీ..!"

"డియర్ లేదు, డార్లింగ్ లేదు మిస్టర్ జనార్ధన్! మనిషిని జీవితంలో ఒకసారి నమ్మవచ్చు. కానీ, మేకవన్నె పులిలా ముఖానికి మాస్క్ వేసుకొని జీవితాలతో పరాచికాలాడితే- ఐ హేట్ దట్ టైప్ ఆఫ్ యాటిట్యూడ్!"

"నేను చెప్పేది పూర్తిగా విను. నా అవసరం నీకు కావాలి, నీ అవసరం నాకు కావాలి. ఇద్దరం ఈ సొసైటిలో మంచి డాక్టర్లం. ఉయ్ షుడ్ యాక్సెప్ట్ వన్ ఎనెదర్!"

"నువ్వు చెప్పేదంతా ట్రాష్! గతం అంతా నాకు సర్దుకుపోవడాలతో సరిపోయింది. అయినా... మనిషిగా నా వ్యక్తిత్వానికి భంగం వాటిల్లినపుడు నా మనస్సాక్షి నాకు శ్రీరామరక్ష!"

"డియర్ మాధవీ... సారీ డాక్టర్ మాధవీలతగారు! ఇప్పుడు నీకు నా మాటల్ని వినిపించుకొనే మూడ్ లేదు... సాయంత్రం కలుస్తాను. ఈలోగా ప్రశాంతంగా ఆలోచించు. నాకు మీ సహచర్యం కావాలి. మీరూ నా నుండి అదే కోరుకుంటారనుకుంటాను!"

– జనార్ధన్ నిశ్చలంగా తలుపు తీసుకొని వెళ్లిపోతూంటే... నిప్పులు చెరుగుతూన్న ఆమె అంతరంగానికి ఒక్కసారి నిస్సత్తువ అవహించింది. ఒక్కసారి కళ్ళు బైర్లు కమ్మినట్లయి కుర్చీలో కూలబడిపోయింది.

జీవితంలో తను ఎన్నడూ కంటనీరు పెట్టి ఎరుగదు. ఎంత కష్టం వచ్చినా బాధలో కూడా నవ్వేందేగాని, తన హృదయాన్ని ఎన్నడూ బయటపెట్టలేదు. కానీ, ఈనాడు గట్టిగా ఏడవాలని ఉంది. "నవ్వకండి..! ఇది విషాదం!" అని నలుగురికి చెప్పాలనిపిస్తోంది. వెన్న పూసిన మాటలకి విషాన్ని జోడించిన జనార్ధన్‌ని తలుచుకొనేసరికి ఒక్కసారి తనువు ఆవేశంతో కంపించిపోతోంది.

'ఎందుకు వదిలావ్ అతన్ని? పీక నులిమి చంపేయకపోయావా?!' అని ఊహలు తనని నిలదీస్తున్నాయి.

ఇంతకాలం 'అతను మనుషుల్లో మనీషి' అనుకొంది. 'కాదు... సగటు మనిషి' అని తేలిపోయేసరికి- వ్యక్తిత్వం వేదనగా రోదిస్తోంది. ఓడి నేలకొరిగిన లత- వాడిన లత అయిపోయింది.

"డాక్టర్! నెంబర్ త్రీ ఇంక్యుబేటర్‌లో బేబీ ఏడుస్తోంది. టెంపరేచర్ వేరియేషన్ ఎక్కువగా ఉంది!" సిస్టర్ పిలుపుతో రెస్ట్రిక్టెడ్ వార్డు వైపు నడిచింది.

అక్కడ ఇంక్యుబేటర్‌లోని బేబీస్‌ని చూసింది.

ఆమెలో ఒక్కసారి ఆవేశం పెల్లుబికింది. ప్రీమెచ్యూర్ కేసులు కొన్ని, డెలివరీలో ఇబ్బందులు కలగడంతో వీక్‌గా పుట్టినవి మరికొన్ని. ఆ శిశువుల్ని ఇంక్యుబేటర్స్‌లో పెట్టి తల్లిగర్భ వాతావారణాన్ని కల్పించింది. ఏడోనెల పాపలకు పదోనెల వరకు ఆ బాక్సులలో ఉంచి సైడ్ఎఫెక్ట్ లేకుండా ఉంచగలుగుతోంది. రోజూ వచ్చిపోయే రోగులతో, ఇన్‌పేషెంట్స్‌తో క్షణం తీరిక లేకుండా పనిచేస్తున్నా హృదయం ఎంతో ఒంటరితనానికి లోనౌతూనే ఉంటుంది.

తన హాస్పిటల్‌లో ఎంతోమందికి మాతృత్వాన్ని ప్రసాదించగలిగింది. కాని, తాను మాత్రం మాతృత్వాన్ని పొందలేకపోయింది. దానికి కారణం... డాక్టర్ జనార్ధన్ కాదా?!

అందుకే తన దగ్గరకు వచ్చిన ప్రతి చిన్నారిని సొంతబిడ్డలా చూసుకుంటుంది. వారిలో తాను కోల్పోయిన వాత్సల్యాన్ని పొంది ఎంతో ఆనందిస్తుంటుంది. చంటిపిల్లలు చేసే అల్లరి ఆమెకు ఇష్టం. బుడిబుడి నడకలతో నడిచి వస్తుంటే మనసు మయూరమై మాతృత్వపు మమకారంతో అలరారుతుంటుంది.

"బాక్స్ టెంపరేచర్ సడెన్‌గా డౌన్ అయింది. ముందు స్టెబిలైజర్ మార్చండి!" సిస్టర్‌కి చెప్పి, సెలైన్ ఇన్‌టెన్సిటీ పెంచేసరికి పాప మామూలు స్థితికి చేరుకొంది.

"డాక్టర్! ఏమిటీ... ఈమధ్య మీలో మూడీనెస్ చూస్తున్నాను? పదిరోజుల నుండి చాలా ఆవేదనగా ఉన్నట్లు కన్పిస్తున్నారు. ముఖంలో నవ్వు ఏమైనట్లు? ఆ ఉత్సాహం ఏమైనట్లు? చాలా ఐసొలేటెడ్‌గా ఉంటున్నారు. ఎనీథింగ్ గోస్ రాంగ్..?" కాంపౌండర్ అడిగేసరికి-

"నో..! ఎవిరిథింగ్ ఈజ్ ఓ.కే.! ఒంట్లో కొంచెం నలతగా ఉంది. కాసేపు పైకి వెళ్లి రెస్ట్ తీసుకోవాలనుకుంటున్నాను! ఎమర్జెన్సీ ఏదైనా ఉంటే నన్ను పిలువ్. రొటీన్ కేసుల్ని నువ్వు హేండిల్ చేసేయ్!"

"ఓ.కే.! బైదిబై... డాక్టర్ జనార్ధన్ సూర్యాపేట వెళుతున్నాననీ, సాయంత్రానికి వస్తాననీ చెప్పమన్నారు. ఈరోజు రిజిష్టర్ పోస్టులో మీకు ఈ కవర్ వచ్చింది!"

● ● ●

కిటికీ కర్టెన్ తీసేసరికి బయట విశాలమైన ఆకాశం కనబడుతోంది.

దట్టంగా కమ్మిన మేఘాల మధ్యనుండి దూసుకువస్తున్న ఉదయభానుడు తనని ఓదార్చడానికి వచ్చాడన్నట్లుగా ఉంది. అసలు ఆ ఆకాశానికి అంతు ఉందేమోగాని, తన అంతు కనబడడం లేదు. ఫ్యాన్ గాలికి టేబుల్‌పై కవరు రెపరెపలాడుతోంది. చించి చూస్తే... అనపర్తి నుండి!

ఆ గ్రామాన్ని ఓ 'మోడల్ విలేజ్'గా తీర్చిదిద్దాలని 'అనపర్తి వాలెంటరీ డెవెలప్‌మెంటల్ సొసైటి" అనే స్వచ్ఛంద సంస్థ ఏర్పాటయింది. రోడ్లు, వసతులు, నీరు, పారిశుధ్యం, ఆరోగ్యం మొదలైన అంశాలను మెరుగుపరచి, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చాలనే ఉద్దేశంతో అక్కడి ప్రజలు స్వచ్ఛంద సంస్థను స్థాపించారు. దానిలో భాగంగా ఓ హెల్త్‌క్లబ్‌ను ఏర్పాటుచేశారు. అక్కడి స్త్రీలు, పిల్లలకు వైద్యసేవలు అందించడానికిగాను గైనకాలజిస్ట్‌లు ముందుకు రావాలని పిలుపు ఇస్తే- మాధవి గ్రామీణ ప్రజలకు సేవలందించాలనే మంచిఉద్దేశంతో తన సర్వీసెస్ ఆఫర్ చేసింది. వాళ్ళు ఆమె ప్రజ్ఞాపాటవాల్ని, సేవాదృక్పథాన్ని పరిగణలోనికి తీసుకొని- వచ్చి ప్రజలకు సేవ చేయవల్సిందిగా ఎన్నోసార్లు కోరారు.

"మధూ! ఇక్కడ హైదరాబాద్‌లో మన ప్రాక్టీసు 'మూడు పువ్వులూ- ఆరు కాయలు'గా అభివృద్ధి చెందింది. మంచి పేరుప్రతిష్ఠలకు కొదవలేదు. ఇలాంటి సిటీస్‌లో ఉంటే మనకు గ్రోత్ ఎక్కువగా ఉంటుంది. డబ్బు సంపాదనకు కూడా అవకాశాలు ఎక్కువ. 'అనపర్తి'లాంటి ఆ చిన్నపల్లెటూరు వెళ్లి ప్రాక్టీసు పెడితే మనకు ఏం మిగులుతుంది చెప్పు? ఉదయాన అరలీటరు పాలు, మధ్యాహ్నం ఓ పనస కాయ తప్ప!"

"నో మైడియర్ జనీ! సరైన వైద్య సౌకర్యాలు లేక పల్లెప్రాంత ప్రజలు ఎన్ని ఇబ్బందులు పడుతున్నారు... చెప్పు?! ముఖ్యంగా స్త్రీలకు సరైన మెడికల్ ఎయిడ్ లేక ఎంతోమంది ఆడవారు, పిల్లలు చిన్నతనంలోనే తమ అమూల్యమైన జీవితాలు కోల్పోతున్నారు. అటువంటిది- కాస్తోకూస్తో చదువుకున్న మనం వారికి సేవ చేయడంలో పరమార్థం ఉంది. ఇటువంటి సిటీస్‌లో మనం కాకపోతే ఎంతమంది డాక్టర్లు లేరు... చెప్పు?!"

"అది సరే! అందరూ మనలాగే అనుకోవాలి గదా! చూడు మైడియర్... మెడికో మధులతాదేవీ! ఆశయాలు వేరు... జీవితం వేరు. ఆశయాల కోసం వెంపర్లాడితే జీవితం శేషప్రశ్నగా మిగిలిపోతుంది. దరిద్రుడు ఎప్పుడూ దరిద్రుడుగానే ఉండాలి. వాడు ఆ స్థానంలో ఉంటేనే గదా... మనం ఈ స్థానంలో ఉండగల్గేది?"

"ఏమో జనీ! కొన్నాళ్లయినా అక్కడివారికి సేవ చెయ్యాలని ఉంది!"

"నేను చెబుతున్నా! నీకు నేను- నాకు నువ్వు! మనకు మరొకళ్ళతో పనేమిటి చెప్పు?! నీకు ఇక్కడ విజిటింగ్ కన్సల్టెన్సీకి ట్రై చేస్తున్నా. అదికూడా వస్తే నీ ఆదాయం లక్షల్లో ఉంటుంది!"

"అసలు... నువ్వు నాలోని మనిషితనాన్ని తరిమేస్తున్నావ్!"

"మనిషితనమూ కాదు... మనసుతనమూ కాదు. నువ్వు నా మనసెరిగితే చాలు!"

జనార్ధన్ మాటలతో ఆనాడు తన ఆశయానికి తిలోదకాలివ్వక తప్పలేదు మాధవీలతకు.

"మాధవమ్మా! అయ్యగారు మిమ్మల్ని ఇంతగా అన్యాయం చేస్తాడనుకోలేదు. ఇంతకాలం ఏదో బాధపడుతుంటే ఏమోలే అనుకున్నాను. ఉదయం నేను ఇల్లు ఊడుస్తూంటే అయ్యగారి అమ్మగారు, నాన్నగారు జనార్ధన్‌బాబుకి మళ్లీ పెళ్ళి చేయాలన్న విషయాన్ని చర్చించుకుంటున్నారు!" పనిమనిషి మాటలు మాధవి మనసుని ఎంతగానో కలచివేశాయి.

"ఎవరో పెద్దిరెడ్డిగారమ్మాయంటమ్మా! ఒకత్తే కూతురంట... పెద్దగా చదువు లేకపోయినా బోలెడంత ఆస్తి ఉందట! వెంటనే అయ్యగారికి పెళ్ళి చేయాలని చూస్తున్నారు. ఆయనకి చానా నచ్చిందట ఆవిడ! 'కులంకాని దానికి సంతానం కనకుండా ముందుజాగ్రత్త తీసుకొని మనవాడు మంచిపనే చేశాడు. పిల్లల కోసం మళ్లీ చేస్తున్నామంటే ఎవర్నుండీ ఏ ఆక్షేపణా ఉండదు' అంటోందమ్మా మీ అత్తగారు!

ఈరోజు సాయంత్రమే తాంబూలాలు కూడా పుచ్చేసుకుంటారంట! మీరు కాదంటే మిమ్మల్ని వదిలించేసుకోడానికి కూడా సిద్ధపడుతున్నారమ్మా వాళ్ళంతా. ఇన్నాళ్లూ మీరు సంపాదించి పెట్టిన డబ్బు వాళ్ళల్లో ఎంత మదాన్ని తెచ్చిపెట్టిందో చూడండమ్మా! కృతజ్ఞత లేని మనుషులు... నీతిలేని నీచులు!"

– తనకెంతో సన్నిహితంగా ఉండే తల్లీ, తోడూలాంటి పనిమనిషి ద్వారా వారి ఉద్దేశాలు గ్రహించిన మాధవి- దాడి జరగ్గా అమెరికా వరల్డ్ ట్రేడ్ సెంటర్ కుప్పకూలినట్లు కూలిపోయింది.

ఎంత నమ్మకద్రోహం?

ప్రేమించానన్నాడు - నీను లేనిదే బ్రతుకే లేదన్నాడు...

. తన అందం, వ్యక్తిత్వం, అభిరుచులని ఆరాధిస్తున్నానని తీయని కబుర్లు చెప్తూ... తనని పరవశంలో పడేశాడు. వెంట వెంట తిరిగాడు, తిప్పుకున్నాడు. అతనే సర్వస్వంలా భావించి లతలా పెనవేసుకుపోయింది- అమాయకంగా తను! చదువే లోకంగా, వైద్యవృత్తి ఆశయంగా

సాగిపోయే తనను ప్రేమపంజరంలో బంధించాడు. తల్లి అన్నివిధాలా తగిన సంబంధం చూసి చేయడానికి సిద్ధపడితే... తనే కాదని వలపు మైకంలో కులాంతరాన్ని పట్టించుకోకుండా అతనితో ఏడు అడుగులు నడిచింది.

నిర్వేదంతో మౌనంగా రోదిస్తున్న మాధవీలత అంతరంగం పది సంవత్సరాల వెనక్కి పరుగుతీసింది.

• • •

"హాయ్! మధూ! బాగా ప్రిపేరవుతున్నారా!?"

చురుగ్గా తల పైకెత్తింది.

"సారీ మాధవీలత గారూ..! 'మధూ' అంటే అంత కోపమెందుకండీ?"

"కోపమెందుకు..? అసలు మన మధ్య 'మధూ... అనేంత చనువు ఎప్పుడు ఏర్పడిందా?' అని ఆశ్చర్యమేసి!"

"రేపు సన్‌డే హాస్టల్‌లోనే ఉంటారు కదా!?"

"లేదండీ... ఇంటికి వెళ్తున్నా!"

"రేపు మన ఫ్రెండ్సంతా నీత్‌లో 'అభినందన' సిన్మాకి ప్లాన్ చేసుకున్నాం. మీరు కూడా వస్తున్నారు!"

"ఎంసెట్ దగ్గరకు వస్తోంటే ఇప్పుడు సిన్మాలేమిటి చెప్పండి?!"

"మీరేకాదు- మేమూ రాస్తున్నామండీ..! నా మాట కాదనరు... వస్తారంతే!"

"లేదు జనార్ధన్! తప్పనిసరిగా ఇంటికెళ్లాలి. అమ్మ ఎదురుచూస్తూ ఉంటుంది!"

"ఏదైనా ఫైనాన్షియల్ ప్రాబ్లమా?"

"సెకండ్ టరమ్ ఫీజ్‌కి మండే కదా లాస్ట్‌డేట్..! కట్టకబోతే ఆదిత్యావాడు నాకు గుడ్‌బై చెప్తాడు!"

"ఎంత... నాలుగువేల రూపాయలే కదా!? నేను ఇస్తానులెండి! ఇంటికి వెళ్లివచ్చిన తరువాత నా సొమ్ములు నాకిద్దురు!"

"................"

• • •

మాధవీలతది అమలాపురం దగ్గరి పాశర్లపూడి గ్రామం.

అక్కడ ఉండేది అమ్మ, తను! అక్క డెలివరి సమయంలో పిల్ల అడ్డం తిరగడంతో పురిటి నొప్పులు భరించలేక అసువులు బాసింది. ఏడోనెలలో పుట్టిన ఆ శిశువుకి కూడా అంతలోనే ఆయువు ముగిసింది.

ఆరోజుల్లో సరైన వైద్యం చేయించలేని చేతగానితనంగా ఆ తల్లి క్రుంగిపోయింది.

"మన ఊళ్లోనే మంచిఆసుపత్రి ఒకటి ఉండిఉంటే ఎంత బాగుండేది? వైద్యం చేయదాన్ని సరైన డాక్టరు ఉంటే ఈ ఘోరం జరిగి ఉండేది కాదు!"

– ఇరుగుపొరుగువారు అంటుంటే ఆ మాటలు మాధవి మనోగతాన్ని మరింత ఉత్తేజపరచి వైద్యవృత్తి పట్ల ఆమెకున్న ఆశయాన్ని బలీయం చేశాయి. వైద్యవసతి లోపించి అక్కకు జరిగిన

అన్యాయం ఎవరి విషయంలోనూ పునరావృతం కాకూడదు. తను పెద్దయి మంచిడాక్టరవ్వాలి. అంధకారంలో కొట్టుమిట్టాడుతున్న అభాగ్యులకు, స్త్రీలకు, పిల్లలకు వైద్యసేవ లందించాలి. అప్పటినుంచి వైద్యవృత్తి మీద మమకారం పెంచుకోసాగింది.

ఎమ్‌సెట్ కోచింగ్ కోసం కాకినాడ 'ఆదిత్య రెసిడెన్షియల్ కాలేజి'లో జాయిన్ అయింది.

"జనార్ధన్... థ్యాంక్సండీ!" అంది- సమయానికి ఫీజు కట్టిపెట్టినందుకు.

"ఇదిగో... నాలుగు వేల రూపాయలు!"

"అంత తొందరేముంది చెప్పండి!?"

"సరే... మీరు ఎలా ప్రిపేర్ అవుతున్నారు?"

• • •

"మధూ! నీవెంత అందంగా ఉన్నావో తెల్సా!?"

"ఎంత!?"

"మాటల్లో చెప్పలేనంత! ఆ అందం, ఆనందం జీవితాంతం మన మధ్య అలాగే ఉండాలని ఆశిస్తాను!"

"తప్పకుండా! మనసున్న మగాడు తోడుగా ఉన్నపుడు ఆడదాని జీవితం ఆనందమయం కాక ఇంకేమిటి!?"

"నీ అందం, ఆడతనం నాకు ఎప్పుడూ ప్రేరణ కావాలి. పిల్లల్ని కంటే నీ అందం చెడిపోతుంది.., రూపం కరిగిపోతుంది. మన వైవాహిక జీవితం సక్సెస్ అవడాన్కి పిల్లలే కావాలంటావా?"

ఆశ్చర్యంగా అతనివైపు చూసింది.

"నాకు నువ్వు అమ్మాయివి- నీకు నేను అబ్బాయిని! మూడోమనిషి నాకు మూడ్ లేకుండా చేస్తుంది. అందుచేత పెళ్ళికిముందే నీవు ట్యూబెక్టమీ ఆపరేషన్ చేయించుకుంటే..."

"మాతృత్వం ఆడదానికి వరం..!"

"అది సగటు స్త్రీ ఆలోచన! నీవు డాక్టర్‌వి. రేపు పేరుమోసిన గైనకాలజిస్టువి. మనం కొన్నింటికి అతీతంగా ఉండాలి!"

"ఆడతనం నా ఊపిరి! ప్రేగు పంచుకు పుట్టిన తన ప్రతిరూపం స్త్రీకి జీవిత సాఫల్యాన్ని చేకూరుస్తుంది!"

"సెంటిమెంటల్‌గా ఆలోచించక ప్రాక్టికల్‌గా ఆలోచించు! నాకు నువ్వు- నీకు నేను తోడుగా ఉన్నంతకాలం మనకు మనమే పసివాళ్ళం!"

"అదికాదు..."

"రేపే ఆపరేషన్ ఏర్పాటుచేశాను... నెలరోజుల్లో మన పెళ్ళి! నువ్వు త్వరగా కోలుకోకపోతే తర్వాత నాకిబ్బంది!" ఏదో జోక్ వేసినట్లు పెద్దగా నవ్వాడు.

మాధవి అయోమయంలో పడిపోయింది. ఏమిటీ వింత ధోరణి- వింత ఆలోచన? ఎక్కడా లేని కొత్తవిధానం! మాతృత్వం మీద ఎంతో మమకారాన్ని హృదయాంతరాల్లో దాచుకున్న తనకు ఆ అవకాశం లేకుండా పోతుంది. మధురమైన ఆ బంగారు కల చెదిరిపోతుంది. ఆపరేషన్‌కు మనసు ససేమిరా అంటోంది.

కానీ, చేయిస్తున్నది ఎవరో కాదు- తన సర్వస్వం, తన కలలోనైనా ఊహించని రాజకుమారుడులాంటి మన్మథుడు... జనార్ధన్.

'మనసిచ్చి మనువాడుతా నంటున్నాడు. తనంత అదృష్టవంతురాలు ఇంకెవరైనా ఉంటుందా?! ఏం... పిల్లలు లేకపోతే జీవితం ఆగిపోతుందా?! అతనన్నట్లు ఒకరికొకరంగా ఉండిపోతే చాలదూ!? పిల్లలు తమ మధ్య ప్రేమానురాగాలకి అడ్డంకి అవుతారేమో? నిజంగా అతని ప్రేమలో ఎంత మాధుర్యం?' ...ఈ తీరులో ఆలోచిస్తున్న మాధవీలత మనసు అతని నిర్ణయానికి తేలిగ్గానే మొగ్గుచూపింది.

'ట్యూబెక్టమీ' ఆపరేషన్ చేయించుకుంది.

మోహం మనిషిని ఎంత మత్తులో పడేస్తుంది?!

మాధవీ, జనార్ధన్‌ల వివాహం గుళ్లో నిరాడంబరంగా జరిగిపోయింది.

తరువాత 'మాధవీ నర్సింగ్ హోమ్' హైదరాబాద్‌లో మంచి అట్టహాసంగా ప్రారంభించ బడింది. జనార్ధన్‌కు డాక్టర్‌గా పెద్ద గుర్తింపు లేకపోయినా- భార్య హస్తవాసితో నగరంలో 'మాధవీ నర్సింగ్ హోమ్-మంచి హాస్పిటల్' అనేపేరు సంపాదించి పెట్టింది.

తమ కులంపిల్లని చేసుకోలేదని జనార్ధన్ తల్లిదండ్రులు మాధవీలత ముందే గునుస్తూన్నా- అతని తరపు బంధువులు అడపాదడపా వచ్చిపోతూ కులచర్చలు చేస్తున్నా- తను చెప్పిన మాట వినలేదని తల్లి తనను అనాదరించినా- వీటన్నింటికి అతీతంగా జనార్ధన్ కనబరుస్తూన్న ప్రేమాభిమానాలకు పరవశమైపోయేది మాధవీలత. ఎక్కువ టైమ్ పేషెంట్స్‌ని చూసుకోవడంతోనే గడిపేసే అంకిత స్వభావురాలైన ఆమె కొన్నివిషయాలకి అసలు ప్రాధాన్యత ఇచ్చేది కాదు.

ఆమెలోని ఔన్నత్యం అతని ప్లానింగ్‌కు బంగారు బాట వేసింది.

కుప్పలు తెప్పలుగా వచ్చి పడుతున్న డబ్బును ఎంత జాగ్రత్తగా సేవ్ చేయాలో- ఎక్కడెక్కడ పెట్టుబడులు పెట్టాలో- ఎన్నెన్ని లాభాలు ఆర్జించాలో తెలిసిన జనార్ధన్- ఆయా వ్యవహారాలలో అత్యంత చాకచక్యంగా డీల్ చేసేవాడు. చాటుమాటుగా తన సరదాలను సాగించుకుంటూ విలాసవంతంగా కాలం గడిపేవాడు.

పేదల దగ్గర రొఖ్ఖించకుండా వారిచ్చిన సొమ్ములు మాత్రమే తీసుకొని వైద్యసేవ చేయాలని ఆమె అభిలాష! కానీ, జనార్ధన్ మొహమాటం అనేది ఏమాత్రం లేకుండా ఫీజులు వసూలు చేసేవాడు. ఆ విషయంలో అతను ఆమెకు నచ్చకపోయినా- తనలోని 'ఇన్నోసెన్సీ' అతన్ని వారించలేకపోయింది.

రానురాను తన కృషి వలన లక్షలు సంపాదించిన అతనిలో ఏదో మార్పు కనిపిస్తోంది.

"మధూ! అప్పట్లో నాకు పిల్లల మీద పెద్దగా ఇంట్రెస్టు లేదు కాని, ఇప్పుడు నేను తండ్రినవ్వాలనే కోరిక నాలో బలంగా వేళ్లూనుకుంటోంది. ఆ విషయమై మా అమ్మానాన్నలు కూడా పోరు పెడుతున్నారు. పిల్లల్ని కనాలంటే- నీకా... అవకాశం లేదు. అందుచేత పెద్దమనసుతో నువ్వు అంగీకరిస్తే మరో అమ్మాయిని పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను. అలాగని నీకేదో ద్రోహం చేస్తానని కాదు... ఎప్పుడూ నువ్వు నాకు ప్రియ మధువే! నీవు నా జీవితంలోకి అడుగుపెట్టిన తర్వాత నాకు అన్నీ కలిసొచ్చాయి. అది నేను ఎప్పటికీ మరువలేను."

నిర్ఘాంతపోవడం ఆమె వంతయ్యింది.

అతడంత పనిచేస్తాడని కలలో కూడా అనుకోలేదు. ఇప్పుడు ఆమెకు అతని ముఖం చూడటానికే అసహ్యం వేస్తోంది.

పిల్లలు ఎందుకని ఆనాడు తనని మోసం చేసి– ఈనాడు అదే సంతానం కోసం మరొకామెను పెళ్ళి చేసుకోవడానికి సిద్ధమవుతున్నాడు.

జనార్ధన్ 'ప్రేమ' పేరుతో తన మంచితనాన్ని ప్రతిక్షణం పావులా వాడుకుంటున్నాడు. వృత్తినే దైవంగా భావిస్తూ తను ఏ విషయాలైతే పట్టించుకోలేదో... ఆ విషయాలలో ఎంతో తెలివిగా ప్రవర్తించాడు.

'అతని అనురాగం ఉంటే చాలు– పిల్లలు లేకపోయినా ఫరవాలేదు' అనుకొంది. తన ఆశయం గురించి కూడా పెద్దగా ఆలోచించకుండా అతనితో తన జీవితం ప్రశాంత పథంలో సాగిపోతే చాలనుకుంది. కాని, ఇప్పుడతని మాటల తీరుతెన్నులు, 'డబ్బు యావ' గమనిస్తూంటే– 'తను ఇన్నాళ్లూ ఎంత కళ్ళుమూసుకుని ప్రవర్తించిందా?' అనిపిస్తోంది. తన గురించి, తన జీవితం గురించి కాస్త ఆలోచించుకోవడం అవసరమనిపిస్తోంది.

'పరపతి', 'హోదా'లకి తను కావాలి కానీ– 'సంతానం' విషయం వచ్చేసరికి 'కులం' అడ్డు వచ్చింది. ఇందుకన్నమాట... ఆనాడు మాయమాటలు చెప్పి ట్యూబెక్టమీ ఆపరేషన్ చేయించాడు! ఎంత దగా?! చదువు, వివేకం ఉండి తనెంత అమాయకంగా అనుసరించింది అతన్ని?

నిజం... మోహం ఎంత చెడ్డదీ?

అతని కపట ప్రేమను నమ్మి తనెంత కోల్పోయింది?!

'ఇప్పటికైనా మించిపోయింది ఏముంది? ఈ దౌర్బల్యం నుండి బయటపడాలి. నన్ను నేను నిలబెట్టుకోవాలి. నిష్కల్మషంగా ప్రేమించలేని దౌర్భాగ్యుడి కోసం కాదు నేను! నాకోసం నేను! నా ఆశయం కోసం నేను!' అనుకుంటూ ఆనాటి బంగారు కలను ఒక్కసారి జ్ఞాపకం చేసుకుంది.

మొదట్నుంచీ తను సెలెక్టెడ్‌గా మంచి చీరలు కొనుక్కుంటుండేది. పెళ్ళి అయినతర్వాత కూడా అడపాదడపా తనే షాపింగ్‌కి వెళ్ళి తనకు నచ్చినవి తీసుకునేది. అతను మాత్రం తన చీరెల విషయంలో అంతగా ఆసక్తి చూపించేవాడు కాదు. సవర్ల కొద్దీ రకరకాల బంగారు ఆభరణాలు తెచ్చి ఒంటినిండా తొడుగుతుంటే 'బంగారం లాంటి భర్త' అని మురిసిపోయేది కాని, అతని నైజం తెలిసి ఇప్పుడిప్పుడే ఒక్కొక్కటే ఆలోచిస్తుంటే అతని ప్రతి చర్య వెనుకా స్వార్థమే కనిపిస్తోంది.

'చీరలైతే కొంతకాలం కట్టి అవతల పడేసేవి. కేవలం తనకు మాత్రమే పనికివచ్చేవి. బంగారమైతే తన తదనంతరం తన కులం భార్యకి, ఆ భార్య కన్న సంతానానికి ఉపయోగపడతాయి. ఎంత దుర్మార్గమైన ఆలోచన?' అనుకుంటుంటే ఆమె ఆపాదమస్తకం జుగుప్సతో కంపిస్తోంది.

'చదువు, నాగరికత ముసుగులో ఎంత రాక్షస నీతి?' అంతకంటే తనున్న పరిస్థితి గురించి ఆలోచించుకోవడానికి ఆమెకు అవమాన మనిపించింది.

ఆడది మగాడిలో ఎటువంటి బలహీనతనైనా భరిస్తుంది...

ఎలాంటి త్యాగానికైనా వెనుకాడదు...

కాని, తన స్థానాన్ని భర్త మరొకరితో భర్తీ చేయబోతుంటే మాత్రం భరించలేదు.

...ఆలోచిస్తున్న ఆమెకు 'స్థిత ప్రజ్ఞత' మదిలో మెదిలింది. తన మాట మీద, ఆశయాల మీద నిలకడలేని మానసిక దౌర్బల్యం కలవారు, వ్యక్తిత్వ రహితంగా ప్రవర్తించేవారు- మృగంకన్నా అపాయకరమైనవారు. అతని నుండి బయటపడితే- ఎట్లా ఉన్నా, ఏ స్థితిలో ఉన్నా గౌరవనీయమే! లేకుంటే బ్రతుకు నిస్సారం! అతని ప్రేమలో కమిట్‌మెంట్ లేదు. కమిట్‌మెంట్ లేనివాడితో తనకెందుకు కమిట్‌మెంట్?

మాధవిలో భావ తీవ్రత ఉధృతమవుతోంది!

తాను కోరుకున్న మనిషి పువ్వులాంటి హృదయాన్ని పూలకత్తితో కోసిపడేస్తుంటే... ఆత్మాభిమానం గల తను ఏమాత్రం ఆకళింపు చేసుకోలేక పోతోంది. జీవిస్తూ అనుభవిస్తున్న ఆవేదన- మరణం కన్నా కఠినమైనదిగా అనిపిస్తోంది.

పురుషుడు నిర్మించిన నీతి, నియమాలలో అతని ఆదేశం ప్రకారం ఆచార బద్ధమైన ఈ సమాజంలో స్త్రీకి ఎన్నడూ సమానత్వం రాదు. స్త్రీ మన్నింపు మట్టిలో కలవడం కూడా మగవాడిపైనే ఆధారపడివుంది. ఆ దుర్భర స్థితిలో స్త్రీకి తోటిస్త్రీ సానుభూతి ఉండదు. అదే ఆడదానికి ఓ పెద్ద శాపం!

తరతరాలుగా మగాడి దుర్నీతి ముందు ఆడతనం బోల్తా పడుతుందన్న నిజం- మాధవి విషయంలో మరోసారి నిజమైంది. పిచ్చిప్రేమతో పిచ్చిగా ఆరాధించిన తనను చివరికి పిచ్చిదానిలా ట్రీట్ చేయడం భరించలేకపోయింది.

అతనితో ఉన్న ఈ ఐదేళ్ల కాలం- 'ఏదో శాపవశాత్తూ గడిపిన తనది కాని అల్పమైన జీవితం'లా అన్పిస్తోందామె కిప్పుడు.

ఈరోజు జనార్ధన్ తన రెండోపెళ్ళికి రంగం సిద్ధం చేసుకుంటున్నాడు. అంటే ఇకనుంచి తనది బానిస బ్రతుకు!

మాధవికి టేబుల్ మీద గాలికి రెపరెపలాడుతున్న అనపర్తి కవర్ స్వాగతం పలుకుతోంది. చిన్నగా ఎగురుతూ తన ఆశయాల్ని గుర్తుచేస్తోంది.

'ఈ అల్పుడి పాశం నుండి ఎప్పుడెప్పుడు బయటపడి తన ఆశయ పథంలో అడుగులు వేద్దామా?' ...అనే ఆరాటం ఆమె మనసుకు బలాన్నిస్తోంది. ఒక్కసారి చదువు, అనుభవం, ఆశయం, వ్యక్తిత్వం... అన్నీ తనలోని దృఢసంకల్పానికి దన్నుగా నిలబడి ఆమె గమ్యాన్ని నిర్దేశిస్తున్నాయి.

తేలికైన హృదయంతో తన 'యాక్సెప్టెన్స్' తెలియజేస్తూ అనపర్తికి లెటర్ వ్రాయడం మొదలుపెట్టింది.

అలా రాయడంలో తన చిరకాల స్వప్నమేదో సాకారమవబోతున్నంత ఆనందం, సంతృప్తి ఆమెలో నిండి- ఒక అనిర్వచనీయమైన అనుభూతికి ఆమెను లోను చేస్తోంది.